సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ సంతోష్

- జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్ సంతోష్

కల్వకుర్తి రూరల్, నవంబర్ 8 : గ్రామ గ్రామాన నిర్వహించనున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించి సర్వే అధికారులు అడిగే వాటికి పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ అధికారులు ఎన్యుమరేటర్లు, మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటికీ స్టిక్కరింగ్ ప్రాసెస్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటి సర్వేకు ప్రజలు ఏ మాత్రం అపోహలు పడకుండా సర్వే అధికారులకు సమాచారం అందించాలన్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇన్యుమరేటర్లు సూపర్‌వైజర్లు ప్రత్యేకాధికారులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఇంటిని సర్వే నిర్వహించాలని ఏ ఒక్క ఇంటిని సర్వే చేయకుండా వదిలివేయొద్దని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎన్యుమరేటర్లు అక్కడే ఉండి ఎంట్రీ చేయించాలన్నారు.

రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన పత్తి రైతులకు మద్దతు ధరను అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని శ్రీబాలాజీ కాటన్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి తేమ 8 శాతం ఉంటే రూ.7,521, 9శాతం ఉంటే రూ.7,445 మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పత్తి రైతులు తాము పండించిన పత్తిని పూర్తిగా ఆరబెట్టిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. పత్తి కొనుగోలును సీసీఐ ఆధ్వర్యంలో జనవరి, ఫిబ్రవరి వరకు కొనుగోలు చేస్తారని తెలిపారు. అనంతరం రైతులు తీసుకువచ్చిన పత్తి తేమశాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీసీఐ కమర్షియల్ అధికారి రమేశ్, తాసీల్దార్ ఇబ్రహీం, మార్కెటింగ్ ఆఫీసర్ స్వరణ్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, ఆర్ఐ చంద్రయ్య ఎన్యుమరేటర్లు నాగరాజు, సునీత, నజీర్ ఉన్నారు.

గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 33 పరీక్షా కేంద్రాలు
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబర్ 8: గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. ఈనెల 17, 18వ తేదీల్లో జరగబోయే గ్రూప్-3 పరీక్షకు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-3 పరీక్షకు 33 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు, అందులో 9,478 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగే గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, అబ్జర్వర్లు ముఖ్యపాత్ర పోషించనున్నట్లు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు తమ సెంటర్‌లో పరీక్షా నిర్వహణకు కావాల్సిన మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, శానిటైజర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పరీక్షా కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. సెంటర్‌కు మూడు కిలో మీటర్ల పరిధిలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు. పోలీస్ సిబ్బంది పరీక్షా కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్ విధించాలని, సెంటర్ పరిధిలో ఎలాంటి వాహనాలు నిలపకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్‌శాఖ సిబ్బంది పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఆర్టీసీ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షా రాయబోయే అభ్యర్థులకు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆరోగ్యశాఖ సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద ఏఎన్ఎం, ఆశవర్కర్లతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఏ ఒక్కరినీ ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లను అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. ఈనెల 14వ తేదీన చీఫ్ సూపరింటెండెంట్లకు శిక్షణ ఉంటుందని, అందరూ హాజరుకావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, రీజినల్ కోఆర్డినేటర్ మధుసూదన్‌శర్మ, డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, ఆర్డీవో సురేశ్, తాసీల్దార్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీటి ఎద్దడి

నీళ్ల కోసం పాట్లు పడుతున్న విద్యార్థుల

కోడేరు, నవంబర్ 8 : కోడేరులోని సీపీఎస్ జీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సీపీఎస్ పాఠశాలలో 48 మంది విద్యార్థులు, జీపీఎస్ పాఠశాలలో 52మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా వీరికి ప్రతిరోజూ మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు శుభ్రం చేయడం కోసం మిషన్ భగీరథ పథకం పైపులైన్ పాఠశాల గేటు వద్ద ఏర్పాటు చేశారు. అవి కూడా నామమాత్రంగా నీళ్లు రావడంతో తాగునీటికోసం విద్యార్థులు తంటాలు పడుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంఈవో భాస్కర్‌శర్మను వివరణ కోరగా పాఠశాలల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నందునా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వాటి ద్వారా నీటిని తీసుకుంటున్నారని త్వరలోనే విద్యార్థులకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

అయ్యప్పస్వామికి గువ్వల ప్రత్యేక పూజలు

స్వాములతో కలిసి భోజనం చేస్తున్న గువ్వల బాలరాజు

అచ్చంపేట, నవంబర్ 8 : పట్టణంలో శుక్రవారం నిర్వహించిన అయ్యప్ప, ఆంజనేయస్వామి పడిపూజలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు. పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం నిర్మాణపనులను పరిశీలించి మాలధారణ స్వాములతో మాట్లాడారు. అనంతరం స్వాములకు బిక్ష వడ్డించి కలిసి భోజనం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు ఇచ్చామని గుర్తు చేశారు. అనంతరం పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్త గడ్డం అజయ్‌కుమార్ యాదవ్ ఇంట్లో జరిగిన ఆంజనేయస్వామి పడిపూజలో పాల్గొన్నారు. స్వామివారికి పూజలు చేశారు. ఆయనవెంట సింగిల్‌విండో చైర్మన్ రాజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, కుతుబుద్దీన్, శంకర్‌మాదిగ, ఖలీల్ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

వంగూరు, నవంబర్ 8 : సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన మండలంలోని కొండారెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి దేవతారాధన పూజలు, విగ్రహ స్థాపన, అభిషేకం, కక్షజ్వాల తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి ధ్వజస్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, సోదరులు కొండల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, పండిత్‌రావు, పాండురంగారెడ్డి, వేమారెడ్డి, లాలూయాదవ్, ముత్యాల లక్ష్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

కల్వకుర్తి రూరల్, నవంబర్ 8 : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, ఎలక్షన్ డీటీ అనిత శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 9, 10వ తేదీల్లో కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈ 2రోజులు బూత్ లెవల్ ఆఫీసర్లు అందుబాటు లో ఉంటారని పేర్కొన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

బిజినేపల్లి, నవంబర్ 8: మండలంలోని వట్టెం గ్రామంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం 9, 11వ తరగతులకు ఖాళీగా ఉన్న సీట్లకోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందు కు ఈనెల 9న ఉండే గడువు తేదీని నవంబర్ 19వ తేదీ వరకు మరోసారి పెంచినట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మొక్కలను సంరక్షించాలి

కల్వకుర్తిరూరల్, నవంబర్ 8 : గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని నాగర్‌కర్నూల్ జిల్లా పీడీ చిన ఓబులేశ్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామాన్ని ఆయన ఇన్‌చార్జి ఏపీవో రాజుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీలో ఉన్న మొక్కలను పరిశీలించారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలోని ఈజీఎస్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు.

విద్యా కమిషన్ సభ్యుడికి సన్మానం

కల్వకుర్తిరూరల్, నవంబర్ 8 : తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్‌ను శుక్రవారం గెస్ట్ లెక్చరర్ల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందంగౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించారు. విద్యాకమిషన్ సభ్యుడిగా నియమించడంపై ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాలస్వామి గౌడ్, గెస్ట్ లెక్చరర్లు కృష్ణ, బీమేశ్వర్, బాలరాజు ఉన్నారు.

ప్రమాదబీమాను సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట టౌన్, నవంబర్ 8 : పోస్టల్ ప్రమాదబీమాను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలో పోస్టాఫీస్ ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. 18 నుంచి 65 ఏండ్ల వయస్సు ఉన్న వారికి రూ.555తో రూ.10లక్షలు, రూ.755తో రూ.15లక్షలు ప్రమాదబీమా సౌకర్యం ఉందని తెలిపారు.

రైతుభరోసా డబ్బులను విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

అచ్చంపేట, నవంబర్ 8 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్న ఇప్పటివరకు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నదని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని సీఐటీయూ కార్యాలయం లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి డబ్బులకోసం రైతులు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. బకాయి ఉన్న రూ.18కోట్ల నిధులు విడుదల చేసి రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. సమావేశం లో సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దేశ్యా నాయక్, బాలపీరు, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న సబిత

నాగర్‌కర్నూల్ రూరల్, నవంబర్ 8 : పిల్లలకు అన్ని రకాల వసతులను కల్పించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా న్యాయ సేవా కార్యదర్శి సబిత అన్నారు. హైకోర్టు ఆదేశానుసారం శుక్రవారం ఆమె నాగర్‌కర్నూల్ పట్టణంలోని బాలసరస్వతి కల్యాణ మందిరం, జ్ఞాన సరస్వతి వాత్సల్య మందిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మందిరాలల్లో ఉన్న పిల్లలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న వసతులను పిల్లల యొక్క బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందిరాల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు అన్ని రకాల వసతులను కల్పించాలని మందిరం సిబ్బందికి సూచించారు. మందిరంలోని పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది దేవిక, బాలరాజు, బాలసరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్, నవంబర్ 8 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బహుజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని డిగ్రీ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యం చేస్తూ చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్స్ ఫీజురీయింబర్స్‌మెంట్స్ చెల్లించక ఇబ్బందులకు గురి చేస్తున్నదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేసిందని ఎన్నికల ముందు పదేపదే మాట్లాడిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫీజు బకాయిలు చేయకపోవడం సరికాదని హితువు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతోపాటు బస్‌పాస్ రేటు తగ్గించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, నాయకులు లక్ష్మణ్, నరేశ్, మధు, దేవేందర్, పవన్, కార్తీక్, బాలరాజు, రమేశ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ అందజేత

ఉప్పునుంతల, నవంబర్ 8 : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొరటికల్‌కు చెందిన వీరారెడ్డికి ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎండీసీసీబీ డైరెక్టర్ సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు మాట్లాడుతూ సంఘంలోని రైతులు, సభ్యులు ఎవరైనా సరే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, సీఈవో రవీందర్‌రావు, డైరెక్టర్లు రవీందర్‌రావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన

అమ్రాబాద్, నవంబర్ 8 : మండలంలోని మన్ననూర్ ప్రశాంత్‌నగర్‌లో కందిపంటను ఏఈవో సీతారాం శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కందిపంటలో కాయతొలుచు పురుగు ఉధృతిని గమనించినట్లు ఆయన తెలిపారు. ఈ పురుగు కాయలను రంధ్రం చేసుకొని లోపలికి వెళ్లి గింజలను తినేసి నాశనం చేస్తుందన్నారు. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉన్నదన్నారు. వీటి నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100గ్రాములు, వేపనూనె ఒకలీటరు కలిపి ఎకరాకు చొప్పున ఉదయం లేదా సాయంకాలం పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

కారుకు నిప్పుపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

అచ్చంపేట(లింగాల), నవంబర్ 8 : మండలంలోని అప్పాయిపల్లిలో కారుకు నిప్పుపెట్టిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. బాధితుడు పుట్ట మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తన రెడ్జ్ కారును ఇంటి ఎదుట నిలిపి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారుకు నిప్పుపెట్టి వెళ్లినట్లు తెలిపారు. తెల్లవారు జామున నిద్రలేచి చూసే సరికి కారు పూర్తిగా కాలిపోయి కనిపించినట్లు తెలిపారు. కారు విలువ దాదాపు రూ.4లక్షలు ఉంటుందని వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగర్‌కర్నూల్, నవంబర్ 8: ఇసుకను అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. అనుమతి లేకుండా తెలకపల్లి నుంచి రాకొండ దారిలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఇండియన్ గ్యాస్ గోదాం వద్ద పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ గణేశ్, ట్రాక్టర్ యజమాని కౌకుంట్ల రాజేందర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కొడుకు ఆత్మహత్యపై అనుమానం

- తండ్రిఫిర్యాదుతో

పూడ్చిన శవాన్ని వెలికితీసి పంచనామా

నాగర్‌కర్నూల్, నవంబర్ 8: మూడు వారాల కిందట ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న కుమారుడి మరణంపై అనుమానం వచ్చిన తండ్రి ఫిర్యాదుతో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన తెలకపల్లి మండలం బొప్పల్లిలో శుక్రవారం చోటు చేసుకున్నది. తెలకపల్లి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొప్పల్లికి చెందిన సామ నవీన్(23) అక్టోబర్ 17న మధ్యాహ్నం 2:30 గంటల ప్రాంతంలో ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని మృతి చెందాడని తెలిపారు. మృతదేహానికి మరుసటిరోజే బొప్పల్లి శివారులోని శ్మశాన వాటికలో పూడ్చిపెట్టారు. నవీన్ మరణం పై అనుమానం కలిగిన తండ్రి మునయ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసుకొని శుక్రవారం తాసీల్దార్ జాకీర్‌అలీ, జిల్లా జనరల్ దవాఖాన డాక్టర్లు హనుమంతరావు, దశరథం సమక్షంలో పూడ్చిన శవాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించారు.

ప్రధాన రహదారికి మరమ్మతులు

చారకొండ, నవంబర్ 8 : మండలంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి మర్రిపల్లి-చారకొండ వరకు గుంతలమయంగా ఉన్న ప్రధాన రహదారినికి శుక్రవారం జాతీయ రహదారి కాంట్రాక్టర్లు మరమ్మతులు పనులు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, నాయకులు బాల్‌రాంగౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

- మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి

వంగూరు, నవంబర్ 8 : వడ్లను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో విమర్శించారు. మండలంలోని రంగాపూర్‌లో సింగిల్‌విండో ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ అట్టహాసంగా ప్రారంభించారు. కానీ కిలో వడ్లు కూడ ఇంతవరకు కొనలేదని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంతవరకు సగానికి పైగా రైతులకు రుణమాఫీ చేయకుండానే పూర్తిగా మాఫీ చేశామని గొప్పలు చెప్పుకోవడం దారుణమని తెలిపారు. దీంతో రైతులు బ్యాంకుల్లో తమ పంట రుణాలను మాఫీ చేయలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు రైతుభరోసా ఇస్తామన్న సర్కార్ ఇంతవరకు అందించకుండా రైతులను మరింత క్షోభకు గురి చేస్తుందని మండిపడ్డారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలి

మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోడేరు, నవంబర్ 8 : మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కొల్లాపూర్ ఐసీడీఎస్ సీడీపీవో వెంకటరమణ పేర్కొన్నారు. జిల్లా వెల్ఫేర్ అధికారిణి రాజేశ్వరి ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండలంలోని బాడుగదిన్నెలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పిల్లల యొక్క సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు పునాదులన్నారు. తల్లులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి సరైన పోషకాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ పుట్టపాగ సునీత మాట్లాడుతూ గృహహింస నుంచి బాధ పడుతున్న మహిళలు సఖీ కేంద్రం ద్వారా అందించనున్న కౌన్సెలింగ్, రక్షణ, తాత్కాలిక వసతి పోలీసు సహాయం లీగల సలహాలు ఉచితంగా పొందవచ్చని సూచించారు. సఖీ కేంద్రానికి రాలేని వారు హెల్ప్‌లైన్ 181 లేదా సఖీ నాగర్‌కర్నూల్ 9951940181 నెంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సఖీ కౌన్సిలర్ ఆర్షియా మాట్లాడుతూ ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే 1098కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

నేడు శ్రీశైలం రానున్న ఏపీ సీఎం

శ్రీశైలంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు

శ్రీశైలం, నవంబర్ 8 : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు శనివారం శ్రీశైలం వస్తున్న సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో విజయవాడ పున్నమి ఘాట్ నుంచి శ్రీశైలం వరకు సీప్లేన్ ద్వారా ల్యాండింగ్ కానున్నందున శుక్రవారం నిర్వహించిన ట్రయిల్‌రన్ విజయవంతం అయినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలిక మృతి

అచ్చంపేట రూరల్, నవంబర్ 8 : ప్రమాదవశాత్తు బావిలో పడి బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని ఐనోల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. సిద్దాపూర్ ఎస్సై పవన్‌కుమార్ కథనం మేరకు నేనావత్ దుర్గ రెండోకూతురు సరిత(19) గ్రామ సమీపంలోని అడవిలో మేకలను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 8 : కొల్లాపూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దశరథం,